సాక్షి
వికారాబాద్

శనివారం ı 11 ı మే ı 2024



బస్తాలు లేవట!

జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. 2లో▸



బీజేపీకే మాదిగల మద్దతు

మాదిగలు భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ కోరారు. 2లో▸



మొరం మట్టితో మమ!

గుంతల మయంగా మారిన బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. 3లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి అమల్లోకి 144 సెక్షన్

ఎస్పీ కోటిరెడ్డి



అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5గంటల నుంచి 13వ తేదీ 6గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా తిరగరాదని సూచించారు. జిల్లాలో బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధమన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిబంధనలు పాటించకున్నా, పోలీసు విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పక్కాగా ఉండాలి

వ్యయ పరిశీలకుడు రాజీవ్ చావ్లా

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్ చావ్లా నోడల్ అధికారులకు సూచించారు. శుక్రవారం వారు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీసీ, ఎన్‌జీఆర్ఎస్, ఎలక్షన్ కంట్రోల్ రూం, సీ విజిల్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల ఎన్నికల ఖర్చును జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద ఖాతాలను చెక్ చేయాలని సూచించారు. ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌సీ అకౌంటింగ్ టీం సభ్యులు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు. డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఎంసీఎంసీ నోడల్ అధికారి చెన్నమ్మ, ఎల్‌డీఎం రాంబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్, ఏఓ మహేందర్, ఎన్నికల విభాగం అధికారులు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, ఈడీఎం మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

నేడే ఆఖరు



పరిగి మండలం ఖుదాన్‌పూర్ రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సాయంత్రం 6గంటలకు ముగియనున్న ఎన్నికల ప్రచారం

- మూగబోనున్న మైకులు
- సభలు, సమావేశాలు, రోడ్ షోలు బంద్
- చివరి రోజు ప్రచార హోరు పెంచనున్న నేతలు

వికారాబాద్: పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో పరిసమాప్తం కానుంది. రెండు నెలలుగా హోరెత్తిన మైకులు మూగబోనున్నాయి. బహిరంగ సభలు, రోడ్ షోలు, సమావేశాలు ఆగిపోనున్నాయి. ప్రధాన పార్టీలన్నీ ప్రచారం హోరెత్తించాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారం ముగించాలి. శనివారం సాయంత్రం 6గంటల వరకు ప్రచారం చేసుకోవచ్చు. ఆ తర్వాత బహిరంగంగా గానీ, అంతర్గతంగా గానీ ప్రచారం చేసుకోవడానికి వీలుండదు. లోక్‌సభ ఎన్నికల బరిలో 41మంది అభ్యర్థులు పోటీలో ఉండగా మూడు ప్రధాన పార్టీలు మాత్రమే ప్రచార పర్వంలో కనిపించాయి. ఈ నెల 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది.

ఇక విందుల పర్వం

నేటితో ప్రచార ఘట్టం ముగియనుండటంతో అభ్యర్థులు కొత్త తరహా ప్రచారానికి ప్లాన్ చేసుకుంటున్నారు. మిగిలిన 48 గంటల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు తమకు అవసరమైన మేరకు మద్యం కొనుగోలు చేసి రహస్య ప్రదేశాల్లో డంప్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు డబ్బులు సైతం సిద్ధంగా ఉంచుకున్నట్లు ఆయా పార్టీల నేతలు చర్చించుకుంటున్నారు. మాస్ ప్రచారానికి ఆస్కారం లేకపోవడంతో యువజన సంఘాలు, కుల సంఘాలు, క్రికెట్ అసోసియేషన్లు, మహిళా సంఘాలు ఇలా గ్రూపులుగా ఉన్న వారిని గుర్తించి వారికి మర్యాదలు చేస్తున్నారు. మద్యం, ఇష్టమైన విందు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాగైనా వారిని మచ్చిక చేసుకొని ఓట్లు వేయించుకోవాలనే లక్ష్యంతో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటీ పడుతున్నాయి.

నిఘా పెంచిన పోలీసులు

ఇప్పటికే అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, అంతర జిల్లాలో చెక్ పోస్టుల వద్ద పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు తనిఖీలు చేస్తున్నాయి. ఎన్నికల పర్వం చివరి ఘట్టానికి చేరుకోవడంతో జిల్లా పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. ప్రధానంగా డబ్బు, మద్యం పంపకాలను నిలువరించడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. అబ్జర్వర్లు, పోలీసు ఉన్నతాధికారులు సైతం డేగ కన్నుతో తనిఖీ బృందాలను పర్యవేక్షిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను తరలిస్తున్నారు.

పోలింగ్‌ను విజయవంతం చేద్దాం

- అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ

అనంతగిరి: పోలింగ్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించాలని వికారాబాద్ నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్, సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది తొందరపాటుతో తప్పులు చేయరాదని సూచించారు. రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా చూడాలన్నారు. నాలుగు సెక్టార్లకు ఒక అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్‌ను నియమించడం జరిగిందన్నారు. సిబ్బందికి సందేహాలు ఉంటే వారిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. మే 12న వికారాబాద్‌లోని మేరీ ఏనాట్స్ పాఠశాలలో ఈవీఎంల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వివరించారు. మే 13వ తేదీ ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ నిర్వహించిన తరువాతే పోలింగ్ ప్రారంభించాల న్నారు. డీఈఓ రేణుకాదేవి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లేశం, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్, జిల్లా మైనార్టీ అధికారి సుధారాణి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మాస్టర్ ట్రైనర్ రాంరెడ్డి పాల్గొన్నారు.



నీరా‘జనం’

సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

- షాద్‌నగర్‌లో ముఖ్యమంత్రి రోడ్‌షో సక్సెస్
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు, జనం
- షాద్‌నగర్ అభివృద్ధికి రేవంత్‌రెడ్డి వరాలు

షాద్‌నగర్/ షాద్‌నగర్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా షాద్‌నగర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో విజయవంతమైంది. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి షాద్‌నగర్‌కు విచ్చేసిన రేవంత్‌రెడ్డికి జనం నీరాజనం పలికారు. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ నుంచి నేరుగా ఆయన సాయంత్రం 6గంటలకు హెలికాప్టర్ ద్వారా షాద్‌నగర్ పట్టణానికి చేరుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, తాండ్ర విశాల, వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర కాశీనాథ్‌రెడ్డి, యాదయ్య యాదవ్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

జన హోరు.. నినాదాల జోరు

హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రత్యేక వాహనంలో బైపాస్ మీదుగా పట్టణంలోని కేశంపేట రోడ్డుకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్ షో ముఖ్యకూడలికి చేరుకుంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ శ్రేణులు, జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. సీఎంకి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఆ రెండు పార్టీలపై విమర్శనాస్త్రాలు

రోడ్‌షోలో రేవంత్‌రెడ్డి అరగంటకు పైగా మాట్లాడారు. ఈ ప్రసంగం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. బీజేపీ, బీఆర్ఎస్‌లపై ఆయన సంధించిన విమర్శనాస్త్రాలు జనం ఆసక్తిగా విన్నారు.

షాద్‌నగర్ రూపురేఖలు మారుస్తా..

షాద్‌నగర్‌ను నగరంగా మారుస్తానని.. రైల్వే ఓవర్ బ్రిడ్జితో పాటు శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వరకు మెట్రోలైన్ విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులు,మున్సిపాలిటీకి రూ.30 కోట్లు కేటాయిస్తానని సీఎం వరాలు కురిపించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పాలమూరు ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేవలం వంద రోజుల్లోనే అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని కొనియాడారు. పదేళ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజల అభివృద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పార్టీలో చేరికలు

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత భీష్వ కిష్టయ్య, మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాష్‌గౌడ్, సాయికృష్ణ తదితరులు సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పోలీసుల భారీ బందోబస్తు

డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా దారి మళ్లించారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు కల్పించాలి

ఏఆర్ఓ వానుచంద్ర



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఆర్ఓ

పరిగి: ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని ఏఆర్ఓ వాసుచంద్ర సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మల్లెమోనిగూడ, సుల్తాన్‌పూర్ గ్రామాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా క్యూలైన్‌లో నిలబడే ఓటర్లకు టెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో తాగు నీరు, విద్యుత్ సరఫరా అందజేయాలన్నారు. రెండు రోజుల ముందుగానే పూర్తి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువ రైతు దుర్మరణం



ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

బంట్వారం: బోరు మోటారును ఆన్ చేయడానికి వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై ఓ యువ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పి.ప్రభాకర్‌రెడ్డి అలియాస్ సాయితేజారెడ్డి(28) గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లాడు. బోరు బావి మోటారుకి సరఫరా చేసే విద్యుత్ సర్వీసు వైర్ పొలానికి ఉన్న ఫెన్సింగ్ చుట్టూ కట్టి ఉంచారు. ఈ క్రమంలో సర్వీసు వైరు తేలి ఫెన్సింగ్‌కు తాకి కరెంట్ సరఫరా అయింది. గమనించని ప్రభాకర్‌రెడ్డి పొలం వద్దకు వెళ్లి ఫెన్సింగ్ వైర్‌కు తాకగానే విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబీకులు వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మి, తల్లిదండ్రులు బక్కారెడ్డి అరుణమ్మ, ఒక సోదరుడు ఉన్నారు. ప్రభాకర్‌రెడ్డి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ మేరకు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో పోలైన 2,177 ఓట్లు

చేవెళ్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్లలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. చేవెళ్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 2,353 పోస్టల్ ఓట్లు ఉండగా ఇందులో 2,177 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు చెప్పారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు ఫెసిలిటేషన్ సెంటర్లను ఉపయోగించారు. నియోజకవర్గంలో 3,581 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకుగాను 3,459 ఓట్లు పోలైనట్లు ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. ఇతర లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి పోలైన మరో 803 ఓట్లతో కలిపితే మొత్తం 4,262 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇక్కడ పోలైనట్లు వివరించారు.

కాసాని గెలుపు పక్కా

రైతుల మేలుకోరేది బీఆర్ఎస్ పార్టీనే

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- తాండూరులో ప్రజా ఆశీర్వాద సభ

తాండూరు: వ్యవసాయ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అధ్యక్షతన ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సభకు మాజీ మంత్రి సబితారెడ్డితో పాటు పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ నేత స్వామిగౌడ్, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. తాండూరు ప్రాంతానికి వస్తే తన పుట్టింటికి వచ్చినట్లు ఉంటుందన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌కు చేవెళ్ల పార్లమెంట్‌పై పూర్తి అవగాహన ఉందన్నారు. గతంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా జిల్లా ప్రజలతో మమేకమయ్యారన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు తాగు, సాగు నీటి గోసలు ఎదుర్కొన్నామన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్య ఏర్పడితే వ్యవసాయ బోరు బావుల నుంచి నీటిని తీసుకొచ్చి తాగే వారమన్నారు. రాష్ట్రం ఏర్పడితే మన నీరు.. మన నిధులు మనకే ఉంటాయనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ కోసం పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చి పట్టణం, గ్రామాలు అనే తేడా లేకుండా ప్రతి ఇంటికి నల్లా నీటిని అందించారన్నారు. రైతులకు రైతుబంధు పథకం అమలు చేసి పెట్టుబడి సాయం అందించిన ఘనత దేశంలోనే కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలు గ్రహించారన్నారు. బీజేపీ దేవుడి పేరుతో రాజకీయం చేస్తోందన్నారు. రాముడు అందరికి దేవుడేనని అందరం మొక్కుదాం.. కానీ ఓటు మాత్రం బీఆర్ఎస్ పార్టీకి వేసుకొందామని పిలుపునిచ్చారు. అంతకు ముందు స్వామిగౌడ్, పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌లతో పాటు పలువురు నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీపనర్సింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు శ్రీశైల్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, కోహిర్‌శ్రీనివాస్, నయిం, కౌన్సిలర్‌లు శోభారాణి, ఆసీఫ్, శ్రీనివాస్‌రెడ్డి, సంధుజా, మాజీ కౌన్సిలర్ నరేందర్‌గౌడ్, నాయకులు తదితరులున్నారు.



సభకు హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

వారిది 'భాయ్'ల బంధం

పరిగి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీది చోటే భాయ్, బడే భాయ్ బంధమని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం పరిగి పట్టణంలో బీఆర్ఎస్ మండల, పట్టణ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు వణుకు పుడుతోందన్నారు. ప్రజల ఆదరణ చూసి ఓర్వలేకే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి రెండు రోజులు కేసీఆర్ ప్రచారం లేకుండా చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయనందుకు ఎంతో బాధపడుతున్నారని, మళ్లీ ఈ పొరపాటు చేయమని చెబుతున్నారని తెలిపారు. కేసీఆర్ చేవెళ్ల గడ్డపై బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను పోటీగా పెట్టారని బీసీలందరూ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చేవెళ్ల చరిత్రలోనే ఇది తొలిసారి అని, ఇంత వరకు ఏ పార్టీ కూడా బీసీలకు టికెట్టు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ బీసీలకు టికెట్టు ఇచ్చినందుకు బీసీల సత్తా ఎంటో చూపించాలని కోరారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు నెలలు అవుతున్నా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశ పెట్టి తమను ఇబ్బంది పెట్టారని ప్రజలే చెబుతున్నారని పేర్కొన్నారు. హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో కర్ర గాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఎంపీలను గెలిపిస్తే రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడి సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఆగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు మళ్లీ ప్రారంభం కావాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ మాటలను నమ్మి మళ్లీ మోసపోవద్దని సూచించారు. కేంద్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి, దేశానికి చేసిందేమీ లేదన్నారు. ప్రతి ఒక్కరూ మరో పది మందికి చెప్పి బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు కాసాని వీరేష్, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వస్తే రాజ్యాంగానికి ముప్పే



సభాస్థలిని పరిశీలిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే తదితరులు

- దేశ ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారు
- బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ నాశనమైంది
- శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- జన జాతర సభ ఏర్పాట్ల పరిశీలన

తాండూరు: దేశంలో బీజేపీ ప్రభుత్వం వస్తే భారత రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు స్థానిక విలియంమూన్ చౌరస్తాలో నిర్వహించనున్న జనజాతర సభ ఏర్పాట్లను ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సభకు ఏఐసీసీ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. దేశ ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అధిష్టానానికి అమితమైన నమ్మకం ఉందని చెప్పారు. జాతీయ స్థాయి నాయకుల జాబితాలో రేవంత్‌రెడ్డి 17 స్థానంలో ఉన్నారని, అతితక్కువ సమయంలోనే ఈ ఘనత సాధించడం గర్వంగా ఉందని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సర్వనాశనమైందని మండిపడ్డారు. ఏది ఏమైనా గ్యారంటీ స్కీమ్‌లను అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఇందుకు కొంత ఆటంకం కలుగుతోందని వివరించారు. బీజేపీ మతం పేరుతో రాజకీయాలు చేస్తోందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గాంధీ కుటుంబంపై విషం కక్కుతోందని మండిపడ్డారు. అధికారిక భవనం నుంచి రాహుల్‌ను వెళ్లగొట్టిన చరిత్ర బీజేపికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, నాయకులు సునీతాసంపత్, రమేష్ మహరాజ్, మురళీకృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు వికారాబాద్‌కు అమిత్‌షా రాక



వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాల గ్రౌండ్‌లో సిద్ధమైన సభ

- భారీ జన సమీకరణకు బీజేపీ ఏర్పాట్లు
- ఎస్ఏపీ కళాశాల గ్రౌండ్‌లో బహిరంగ సభ

వికారాబాద్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శనివారం వికారాబాద్‌కు రానున్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున ప్రచార కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ నెల మొదటి వారంలోనే ప్రధాని మోదీ వికారాబాద్‌కు రావాల్సి ఉండగా ఆ పర్యటన రద్దు కావటంతో తిరిగి అమిత్‌షా పర్యటన ఖరారయింది. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయన అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో వికారాబాద్ చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు చేరుకొని 11.15 నిమిషాలకు ఎస్ఏపీ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొని కార్యకర్తలు, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12.15 నిమిషాలకు ఆయన ప్రసంగం ముగియనుండగా 12.30 నిమిషాలకు వనపర్తిలో నిర్వహించే సభకు బయలుదేరుతారు.

సభకు భారీ ఏర్పాట్లు

ప్రచార పర్వం చివరి దశకు చేరుకున్న తరుణంలో బీజేపీలో అగ్ర నాయకత్వం పిలువబడే అమిత్‌షా వికారాబాద్‌లో నిర్వహించే సభకు హాజరుకానున్న నేపథ్యంలో భారీ ఏర్పాట్లు పార్టీ శ్రేణులు చేస్తున్నాయి. ఇదే సమయంలో భారీగా జన సమీకరణ చేసేందుకు పార్టీ సిద్ధమయింది. అమిత్‌షా హాజరుకానున్న సభ కావటంతో పార్టీ వాయిస్‌ను ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాలనే లక్ష్యంతో జనాలను పెద్ద ఎత్తున తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గం నుండి 10 వేల మందిని తరలించాలని ప్లాన్ చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. స్థానిక వికారాబాద్ నియోజకవర్గం నుంచి 15 వేల మందికి తక్కువ కాకుండా జన సమీకరణ చేయాలని నాయకులు ప్లాన్ చేశారు. ఓరాల్‌గా ఈ బహిరంగ సభకు 50 వేల మందిని తరలించాలని వారు ప్లాన్ చేశారు.

పిడుగుపాటుకు గేదె మృతి

పరిగి: పిడుగుపాటుకు గురై గేదె మృతి చెందిన సంఘటన మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పట్టణ కేంద్రానికి చెందిన గొల్ల రామయ్య తన పొలంలో గేదేలను మేపుతుండగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో చెట్టు కింద కట్టివేసిన గేదెపై పిడుగు పడి మృతి చెందింది. రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పూడూరు: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధారూరు మండలం మోమిన్‌కాలాన్ గ్రామానికి చెందిన బంటు జమాలుద్దీన్(43) ఈ నెల 6న తన కూతురు పెళ్లి కార్డులు పంచేందుకు పూడూరు మండలం కండ్లపల్లికి బైక్‌పై వెళ్లారు. మార్గమధ్యలో నయారా పెట్రోల్ పంపు వద్ద ఓ కారు అతి వేగంగా వచ్చి ఆయన బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జామలుద్దీన్ తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. మృతుడి భార్య బంటు బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమావేశంలో కుప్పకూలి వృద్ధురాలి దుర్మరణం



చంద్రమ్మ (ఫైల్)

పరిగి: బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి వచ్చిన ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పరిగి పట్టణ కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పట్టణ కేంద్రంలోని నాయికోటవాడకు చెందిన చంద్రమ్మ(77) బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరై అక్కడే భోజనం చేసి కూర్చుంది. నీరసంగా ఉండటాన్ని గమనించిన స్థానికులు పరిగిలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వృద్ధురాలి మృతితో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

లారీ ఢీకొట్టి.. వ్యక్తి మృతి

కొత్తూరు: వెనకాల నుంచి వచ్చిన లారీ ఓ బైకును ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో జాతీయ రహదారిపై పెంజర్ల కూడలి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌కు చెందిన సయ్యద్ ఉమర్ తన చిన్నమ్మ నాజియాబేగం(28) ఆమె కూతురు మహీన్‌తో కలిసి బైకుపై మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం చుక్కంపేట గ్రామంలో ఉర్సు ఉత్సవాలకు బయలు దేరారు. మార్గమధ్యలో కొత్తూరు పెంజర్ల కూడలి వద్దకు రాగానే వారి బైకును వెనకాల నుంచి ఓ కంటెయినర్(లారీ) ఢీకొట్టింది. దీంతో బైకు కిందపడడంతో నాజియాబేగం తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

బస్తాలు లేవట!

- కేంద్రాల వద్ద అన్నదాతల ఆందోళన
- అకాల వర్షాలకు తడుస్తున్న వడ్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ధాన్యం అమ్మేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బస్తాలు లేక ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతోంది.

ధారూరు: జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ప్రారంభమై పక్షం రోజులు అవుతున్నాయి. పంట నూర్పిడి చేసి పొలాల్లోనే ధాన్యాన్ని ఆరబెడుతున్నారు రైతులు. ధాన్యం అమ్మకానికి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల సహకారం కొరవడింది. గన్నీ బ్యాగులు ఇవ్వకూడదనే నిర్ణయం అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలను అడిగితే బస్తాలు ఇవ్వడం కుదరని చెబుతున్నారు. నగదును డిపాజిట్ చేస్తాం.. ధ్యానం తెచ్చాక లెక్క చూసుకుందామని కోరినా వినడం లేదు. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో అన్నదాతలు విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు. పొలాలు, ఇంటి ఆరుబయట ఆరబెట్టిన ధాన్యాన్ని సంచుల్లో నింపలేక.. కప్పేందుకు కవర్లు లేక ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసి ముద్దవుతున్నాయి. దీనిపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గన్నీ బ్యాగుల సరఫరా చేస్తేనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చేందుకు వీలవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సాకులు చెబుతున్నారు

బహిరంగ మార్కెట్‌లో సంచులు కొనుగోలు చేసి ధాన్యాన్ని నింపగా అకాల వానలు వాటిని తడిపేసాయని రైతులు వాపోయారు. తడిసిన ధాన్యాన్ని సంచుల్లోంచి తీసి మళ్లీ ఆరబెట్టుకరమ్మంటున్నారు. పంటను పండించడం కష్టమనుకుంటే సేకరించిన ధాన్యాన్ని విక్రయించడం గగనమైందని విచారం వ్యక్తం చేశారు. ఇటీవల తడిసిన ధాన్యాన్ని కొంటామని ప్రభుత్వం ఇచ్చిన హామీ రైతుల్లో ఆశాలు రేకెత్తించింది. కానీ క్షేత్రస్థాయిలో గన్నీ బ్యాగులు ఇవ్వడానికి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సాకులు చెబుతున్నారని మండి పడుతున్నారు. అధికారులే ఆలోచించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

> **ఉన్నతాధికారులకు నివేదించాం**
>
> వాస్తవానికి కొనుగోలు కేంద్రాల వద్ద ఇచ్చే గన్నీ బ్యాగుల లక్ష్యం పక్కదారి పడుతోంది. తీసుకున్న వాళ్లు ఎవరూ తిరిగి ఇవ్వడం లేదు. సిబ్బంది అడిగితే నాణ్యత లేని బస్తాలను ఇస్తున్నారు. గన్నీ బ్యాగుల అంశాన్ని పరిశీలిస్తున్నాం. త్వరలోనే దీనిపై క్లారిటీ ఇస్తాం.
>
> – రాజేశ్వర్, పౌరసరఫరా శాఖ, జిల్లా అధికారి



గట్టెపల్లిలో సంచుల్లో నింపిన తర్వాత వానకు తడిసిన ధాన్యం

వాడవాడలా బసవేశ్వరుడి నామం

జిల్లా వ్యాప్తంగా జయంతి కార్యక్రమాలు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మహాత్మా బసవేశ్వరుడి జయంతిని వైభవంగా నిర్వహించారు. యువజన సంఘాలు, రాజకీయ పార్టీలు, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆ దార్శనికుడి సేవలు మననం చేసుకొని నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా సమ సమాజ స్థాపనకు బసవేశ్వరుడు ఎనలేని సేవలు చేశాడని వక్తలు కొనియాడారు.



కొడంగల్ రూరల్: వీరశైవ సమాజం సభ్యులతో పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి



బంట్వారం: కోట్‌పల్లిలో వేడుకలు



పరిగి: బసవేశ్వర విగ్రహం వద్ద..



తాండూరు: బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్



అనంతగిరి: ఎన్నెపల్లిలో బసవేశ్వర జయంతిలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



తాండూరు: బసవేశ్వర విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి